క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు, సూచనలను తెలుసుకునేందుకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలను తెలియజేసేందుకు 99592 25958 నంబర్‌కు కాల్ చేయాలన్నారు.

ఐలు ఆధ్వర్యాన సెమినార్

ఖమ్మం లీగల్: న్యాయవాదులకు ట్రాన్స్ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్, మార్కింగ్ ఆఫ్ డాక్యుమెంట్స్‌పై ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఖమ్మం ఆధ్వర్యాన తరగతులు నిర్వహించనున్నట్లు గురువారం అసోసియేషన్ బాధ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న(శనివారం) ఉదయం ప్రారంభమయ్యే ఈ తరగతులను స్థానిక జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రారంభమవుతుండగా.. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.శివశంకర్‌రావు, తెలంగాణ బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ హాజరవుతున్నట్లు తెలిపారు. అసోసియేషన్ బాధ్యులు ఏడు నూతల శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, నవీన్ , చైతన్య, వెంకట్ పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు డీసీపీ

కూసుమంచి: జిల్లా సరిహద్దు మండలంలోని నాయకన్‌గూడెం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును అదనపు డీసీపీ ప్రసాదరావు గురువారం తనిఖీ చేశారు. వాహనాల తనిఖీ నిర్వహణపై ఉద్యోగులకు సూచనలు చేశారు. ఆతర్వాత కూసుమంచి పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించారు. సీఐ సంజీవ్, ఎస్సైలు నాగరాజు, దివ్య ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఖమ్మంఅర్బన్: నగరంలోని పుట్టకోటకు చెందిన రెడ్డిబోయిన రాంబాబు కొద్ది రోజుల క్రితం తన మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. ఈ విషయాన్ని ఖమ్మంఅర్బన్ పోలీస్ స్టేషన్‌లో తెలపగా.. విచారణ జరిపి ఎస్ఐ డి.శ్రవణ్‌కుమార్ ఫోన్‌ను గురువారం రాంబాబుకు అప్పగించారు.

కామేపల్లి ఎస్సైగా శ్రీకాంత్



శ్రీకాంత్‌తో సాయికుమార్

కామేపల్లి: కామేపల్లి ఎస్సైగా పి.శ్రీకాంత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై సాయికుమార్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ కాగా, బాధ్యతలు స్వీకరించగా శ్రీకాంత్‌కు సాయికుమార్ మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

కేఎంసీకి చేరిన యూనిఫామ్ చీరలు



చీరల లోడ్‌తో వచ్చిన వాహనం వద్ద ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు 'రేవంతన్న కానుక'పేరుతో ప్రభుత్వం అందజేసే యూనిఫామ్ చీరలు కేఎంసీకి చేరాయి. గురువారం 37,300 చీరల లోడ్ కార్యాలయానికి రాగా మెప్మా అధికారులు భద్రపరిచారు. బతుకమ్మ, దసరా పండుగకే చీరలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించినా.. సమయానికి చీరలు చేరలేదు. త్వరలోనే ఈ చీరలను సభ్యులకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	32	బచ్చలికూర	4
వంకాయ	40		20
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	46		20
కాకర	46	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	50	తోటకూర	4
దొండ	30		20
పొట్లకాయ	36	గోంగూర	4
చిక్కుడు	86		20
గోరుచిక్కుడు	50	మెంతికూర	3
క్యాబేజీ	30		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		40
చామగడ్డ	30	పుదీన	1
క్యారెట్	66		20
బీట్‌రూట్	50	-ఖమ్మం వ్యవసాయం	



ఖాళీ స్థలంలో నిలిచిన మురుగు



ఇళ్ల మధ్య కాల్వల ద్వారా పోతున్న మురుగు

దుర్గంధం.. దుర్భరం!

రాపర్తినగర్‌లో డ్రెయినేజీలు కరువు

- మురికికూపాలుగా ఖాళీ స్థలాలు
- కదలని మురుగుతో స్థానికుల ఇబ్బంది
- పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం

ఖమ్మం రాపర్తినగర్: నగరంలోని రాపర్తినగర్‌లో డ్రెయినేజీలు కరువయ్యాయి. దశాబ్దాల క్రితం ఇళ్లు నిర్మించినా.. డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా ఖమ్మం మున్సిపల్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాపర్తినగర్ వైఎస్ఆర్ బొమ్మ దగ్గర నుంచి అరకొరగా డ్రెయినేజీలు ఏర్పాటు చేయగా.. అక్కడ నుంచి రాపర్తినగర్ శివారు రోడ్డు నంబర్ 3 నుంచి 13 వరకు డ్రెయినేజీలు లేక ఎక్కడి మురుగు అక్కడే నిలిచి స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

వీధులు.. కంపుమయం

వర్షాలు పడిన సమయాన కాలనీలో చేరిన మురుగుతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని స్థానికులు వాపోతున్నారు. దోమలు విపరీతంగా వృద్ధి చెంది వ్యాధుల బారిన పడుతున్నా.. మున్సిపల్ శాఖ పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. అంతేకాక రాపర్తినగర్‌లోని వివేకానందనగర్, నందినగర్, గాయత్రినగర్‌లలోనూ డ్రెయినేజీలు లేక వీధులు అస్తవ్యస్తంగా మారాయి. వివేకానందనగర్‌లో దాదాపు 12 వీధులున్నా ఏ వీధిలోను డ్రెయినేజీలు లేకపోగా.. ఇళ్ల మధ్య నుంచే డ్రెయినేజీ నీళ్లుపోవడంతో వీధులన్నీ కంపుకొడుతుండడంతో అక్కడి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

రోడ్లు.. అధ్వానం

రాపర్తినగర్ శివారు నుంచి రమణగుట్టకు వెళ్లే ప్రాంతంలో రోడ్లు అధ్వానంగా మారాయి. అయినా వీటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు, ప్రయాణికులు పేర్కొంటున్నారు. రాపర్తినగర్‌లో ప్రధాన రోడ్డు నుంచి శివారు వరకు నామమాత్రంగా తవ్విన కాల్వల ఆనవాళ్లు కనిపించడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వందలాది ఇళ్లు నిర్మాణమైన అధికారులకు డ్రెయినేజీలు నిర్మించాలనే యోచన రాకపోవడం శోచనీయమనే చెప్పాలి.



రాపర్తినగర్ నుంచి రమణగుట్ట వెళ్లే రోడ్డు దుస్థితి

ఇబ్బంది అవుతోంది..



గాయత్రినగర్‌లో గత పదేళ్లకుపైగా ఉంటున్నా ఇక్కడ డ్రెయినేజీలు నిర్మించలేదు. దీంతో దోమలు విపరీతంగా పెరిగి ఇళ్లల్లోకి రావడంతో వ్యాధులబారిన పడుతున్నాం. ఇప్పటికైనా దీర్ఘకాలిక ప్రణాళికతో డ్రెయినేజీలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది. వర్షాలు పడితే మరింత ఇబ్బంది అవుతుంది.

– లింగంపల్లి గంగన్న, గాయత్రినగర్

పట్టించుకోవడం లేదు..



వైఎస్ఆర్ బొమ్మ నుంచి రాపర్తినగర్ శివారు ప్రాంతం వరకు ఎక్కడ డ్రెయినేజీలు లేవు. కనీసం కాల్వ ద్వారా మురుగునీరు పోయేలా చేయడం లేదు. మున్సిపల్ శాఖకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారే ఇలా ఉంటే శివారు ప్రాంతం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

– సుంకర నాగరాజు, రాపర్తినగర్

నిధులు కేటాయించాలి



రాపర్తినగర్‌లో డ్రెయినేజీల నిర్మాణానికి బడ్జెట్లో మున్సిపల్ శాఖ ప్రత్యేక నిధులు కేటాయించాలి. డ్రెయినేజీలు లేకపోవడంతో పక్కనే ఉన్న ఖాళీస్థలాలు మురికి కుంటలుగా మారుతున్నాయి. వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కార మార్గం చూపేలా అధికారుల చర్యలు చేపట్టాలి.

– ఎ.వెంకటనారాయణ, రాపర్తినగర్

రోడ్డు కిందకు.. డ్రెయినేజీ పైకి..

ఖమ్మం రాపర్తినగర్: మామిళ్లగూడెంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వద్ద ఇటీవల వేసిన సీసీ రోడ్డుతో స్థానికుల సతమతమవుతున్నారు. రోడ్డు వేసిన కాంట్రాక్టర్ డ్రెయినేజీతో సంబంధం లేనట్టుగా రోడ్డు కిందకు వేయించడంతో డ్రెయినేజీ నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. దీంతో స్థానికులు, ప్రయాణికులు ఆ మురుగు నీటి నుంచే వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయాన్ని మున్సిపల్ శాఖకు తెలిపినా పట్టించుకోవడం లేదని, ఉదయం, మధ్యాహ్నం వరకు రోడ్డుపై మురుగు అలాగే నిలిచి దుర్వాసన వస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా సమస్యకు పరిష్కార మార్గం చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిన మురుగు

రాజుకుంటున్న ఎన్నికల వేడి..

అభ్యర్థుల ఎంపికలో పార్టీల మల్లగుల్లాలు

మండలాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్‌కు బ్రేక్ పడినా.. అభ్యర్థుల ఎంపికలో రాజకీయ పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. పోటీ ఉత్సాహం ఉన్న వారికి వారి పరిధిలో రిజర్వేషన్ బెడిసికొట్టడంతో అన్ని పార్టీలకు తలనొప్పిగా మారింది. అయితే బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడం, నాలుగు వారాల పాటు ఎన్నికలు వాయిదా పడడంతో వివిధ పార్టీల నాయకులు డైలామాలో పడిపోయారు.

రఘునాథపాలెం: మండలంలో 13 ఎంపీటీసీ స్థానాలకు, ఒక జెడ్పీటీసీ స్థానానికి పోటీని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ పార్టీల మధ్య కలయిక సాధ్యాసాధ్యాలపై చర్చలు జరుగుతున్నాయి. మిత్ర పక్షాలను కలుపుకుంటే, కలపకుంటే ఉండే లాభనష్టాలపై నాయకులు చర్చలు జరుపుతున్నారు. ఇక తెలంగాణ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మాత్రం ఒక అడుగు ముందుకేసి గురువారం రెండు ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మల్లేపల్లి ఎంపీటీసీ స్థానానికి పోతగాని ఉపేందర్, వీర్లపూడి ఎంపీటీసీకి చిట్టి అనే అభ్యర్థులను పార్టీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అజ్మీరా వీరునాయక్ ప్రకటించారు. జెడ్పీటీసీ బీసీలకు కేటాయించడంతో ప్రత్యర్థి పార్టీ ఎవరిని నిలుపుతారో చూసి వారికి తగిన వారిని పోటీకి నిలపాలని ప్రధాన పార్టీలు వేచి చూస్తున్నట్లు సమాచారం.

➡ తొలి రోజు నామినేషన్లు నిల్..

నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్, నేలకొండపల్లి మండలాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి గురువారం అధికారులు నామినేషన్లు స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. అయితే సాయంత్రం వరకూ ఒక్కరు కూడా నామినేషన్లు దాఖలు చేయలేదు. ఈనేపథ్యాన ఖమ్మంరూరల్, నేలకొండపల్లిలో ఏర్పాటు చేసిన నామినేషన్ల కేంద్రాలను ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు సందర్శించగా.. ఎంపీటీసీలకు సంబంధించిన ఓటర్ లిస్టును ఎన్నికల అధికారులు ప్రదర్శించారు.




నేలకొండపల్లిలో నామినేషన్ల కోసం ఎదురు చూస్తున్న రిటర్నింగ్ అధికారి

➡ జెడ్పీటీసీ ఒకటి, ఎంపీటీసీ రెండు

కూసుమంచి: స్థానిక సంస్థల ఎన్నికలకు గురువారం నామినేషన్ల స్వీకరణ చేపట్టగా మండలంలో మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఒకటి కూసుమంచి జెడ్పీటీసీ స్థానానికి కాగా కూసుమంచి, చేగొమ్మ ఎంపీటీసీ స్థానాలకు ఒక్క నామినేషన్ దాఖలైంది. జెడ్పీటీసీ స్థానానికి పెనుబల్లి మండలం, గంగాదేవిపాడు గ్రామానికి చెందిన మాలోత్ శ్యామ్‌లాల్ నాయక్, ఆధార్ పార్టీ తరుపున నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి శ్రీలతకు అందజేశారు. దీంతో పాటు కూసుమంచి ఎంపీటీసీ స్థానానికి కాంగ్రెస్ తరపున చెన్ను మౌనిక, చేగొమ్మ ఎంపీటీసీ స్థానానికి కాంగ్రెస్ తరపున చిర్రా శ్రీహరి తమ నామినేషన్లను దాఖలు చేశారు.

విప్లవానికి దిక్సూచి చేగువేరా



జోహార్లు అర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: సామ్రాజ్యవాద వ్యతిరేక తిరుగుబాటు విప్లవానికి దిక్సూచి చేగువేరా అని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగూరి వెంకటేష్ కొనియాడారు. గురువారం చేగువేరా 58వ వర్ధంతి సందర్భంగా ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యాన, ఖమ్మం రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పీడీఎస్‌యూ నేతలు చేగువేరా చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. నేటితరం యువత, విద్యార్థులు చేగువేరాను ఆదర్శం తీసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై, మతోన్మాద ధోరణులకు వ్యతిరేకంగా యువత ఉద్యమించేందుకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి లక్ష్మణ్, సహాయ కార్యదర్శులు షేక్ నాగుల్‌మీరా, వంశీ, శివ, జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్, నాయకులు గోపి, నరేందర్, రాహుల్, యశ్వంత్, గణేష్, అభిషేక్, దిలీప్, ప్రశాంత్, విశ్వనాథ్, చరణ్, సురేష్, అన్వేష్, హరిచంద్ర, అశోక్, శ్రీను, శ్రీకాంత్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల పరిశీలన

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల పురోగతిని గురువారం బీజేపీ రాష్ట్ర కోశాధికారి డి.వాసుదేవరావు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ ప్రభుత్వం ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సేవలు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతోందన్నారు. ఖమ్మం స్టేషన్ రాష్ట్రంలోనే ఒక మోడల్ స్టేషన్‌గా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, నున్నా రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, జిల్లా సెక్రటరీ తొండెపు సైదేశ్వరరావు, సుధాకర్, సరస్వతి, మార్తి వీరభద్రప్రసాద్, భద్రం, గడిల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్టాప్ అమల్లోకి..



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్, ఆర్టీసీ ఉద్యోగి

ఖమ్మంఅర్బన్: ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా నగరంలోని ఇందిరానగర్ జంక్షన్ వద్ద ఉన్న ఆర్టీసీ బస్టాప్‌ను పర్ణశాల రామాలయం సమీపానికి మార్పు చేయగా.. గురువారం నుంచి కొత్త బస్టాప్ అమల్లోకి వచ్చింది. ఈనేపథ్యాన పాత బస్టాప్ వద్ద ట్రాఫిక్ పోలీస్, ఆర్టీసీ సిబ్బంది పహారా కాస్తూ బస్సులను అక్కడ ఆగనివ్వకుండా ముందుకు పంపుతున్నారు. అంతేకాక బస్టాప్ మార్చినట్లు తెలిసేలా బోర్డును సైతం ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తీరనట్లయింది. కాగా, కొత్త బస్టాప్ వద్ద ప్రయాణికులు వేచి ఉండేందుకు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బీసీలకు మళ్లీ అన్యాయమే..



సమావేశంలో మాట్లాడుతున్న గుండాల కృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్ర ప్రభుత్వ విధానాలతోనే బీసీ రిజర్వేషన్‌పై హైకోర్టు స్టే విధించిందని బీసీ సంక్షేమ సంఘం సీనియర్ నాయకులు గుండాల కృష్ణ ఆరోపించారు. గురువారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం హక్కుగా రావాల్సిన రిజర్వేషన్‌ను అడ్డుకోవాలని హైకోర్టులో, సుప్రీంకోర్టులో ప్రభుత్వం కేసులు వేశారన్నారు. రిజర్వేషన్ అమలు చేయకపోతే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు కూరాకుల నాగభూషణం, బొమ్మ రాజేశ్వరరావు, కత్తి నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

➡ బీసీ రిజర్వేషన్‌కు అడ్డంకులు సృష్టించొద్దు..

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను అమలు చేయడంలో ఎలాంటి అడ్డంకులు సృష్టించొద్దని బీసీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సంయుక్త చర్యా సమితి (జేఏసీ) అన్ని వర్గాలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు బాధ్యులు దేవరకొండ సైదులు, జి.కిరణ్ తదితరులు పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌లో హైకోర్టు సమీపంలో నిర్వహించిన సమావేశంలో సైదులు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కీలకపాత్ర పోషించిందన్నారు. నాయకులు రాజేష్ పాల్గొన్నారు.

➡ ప్రభుత్వానిది ద్వంద్వ వైఖరి..

ఖమ్మం వైరారోడ్: బీసీ రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైభవంగా రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కమాన్‌బజార్ స్తంభాద్రి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 61వ వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాలా చార్యులు, ప్రధాన అర్చకులు శేషభట్టర్ రఘునాథాచార్యులు, అర్చకులు మధుసూదనాచార్యులు, ఐరన్ హార్డ్‌వేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరామర్శ

కూసుమంచి: మండలంలోని మునిగేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు రామా శ్రీను తల్లి కళావతి ఇటీవల మృతిచెందారు. ఈమేరకు గురువారం మహిళా కార్పొరేషన్ మాజీ చైర్మన్, టీపీసీసీ కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి ఆయన కుటుంబాన్ని పరామర్శించి కళావతి చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ రామా వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు కాన్షిరాం



సమావేశంలో మాట్లాడుతున్న బండి పృథ్వీరాజ్

ఖమ్మం మామిళ్లగూడెం: బహుజన రాజ్యాధికార పోరాటయోధుడు కాన్షిరాం అని బీఎస్పీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండి పృథ్వీరాజ్ అన్నారు. బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం 19వ వర్ధంతి సందర్భంగా ఖమ్మంలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. అట్టడుగు ప్రజల అధికారానికి బాటలు వేసిన నాయకుడని ఆయన కొనియాడారు. జిల్లా అధ్యక్షుడు నాగేశ్వారవు, ఎం.పుల్లయ్య, శ్రీనివాస్, విజయ్‌కుమార్, కృష్ణ, రామయ్య, మిర్యాల నాగరాజు, ఎం.నాగేశ్వరరావు, రమేష్, ఉపేందర్, నాగరాజ్, రమేష్, కోటయ్య, అర్జున్, శంకర్, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటేషన్లు రద్దు చేయాలి



హెచ్ఎంకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

కూసుమంచి: మండలంలోని మల్లేపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను రద్దు చేయాలని గురువారం ఎంఈఓ బీవీ రామాచారి, పాఠశాల హెచ్ఎం ఆదిలక్ష్మి విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. తమ పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా ఉపాధ్యాయులను తిరిగి వెనక్కు పంపించాలని, లేకపోతే సోమవారం నుంచి పాఠశాల బంద్ నిర్వహిస్తామని హెచ్చరించారు.

'అన్నం' ఆధ్వర్యాన అంత్యక్రియలు

ఖమ్మంవైద్యవిభాగం: విశాఖపట్నం జిల్లా సింహాచలం గ్రామానికి చెందిన వీరవెల్లి కుమార్ విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే రైలులో ప్రయాణం చేస్తూ ఖమ్మం సమీపాన అనారోగ్యానికి గురయ్యారు. ఖమ్మం రైల్వే పోలీసుల సహకారంతో ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని వైద్యశాల సిబ్బంది మార్చురీలో భద్రపరిచి కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వగా.. ఆయన అత్త నారాయణమ్మ, కుమారుడు అశోక్, చెల్లెలు అన్నపూర్ణ, ఇతర కుటుంబ సభ్యులు ఇక్కడకు చేరుకుని మృతిపట్ల అనుమానాలు లేవని లిఖితపూర్వకంగా తెలిపారు. అనంతరం మృతదేహాన్ని తరలించేందుకు వారి ఆర్థిక పరిస్థితి బాగోలేనందున అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యాన గురువారం బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



మృతదేహం వద్ద ఫౌండేషన్ బాధ్యులు

'ఎస్‌బీఐటీ' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మం సహకారనగర్: సాఫ్ట్‌వేర్ సంస్థ సర్వీస్‌నౌ నిర్వహించే సర్టిఫైడ్ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ (సీఎస్ఏ) పరీక్షలో తమ కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈమేరకు గురువారం విద్యార్థులను అభినందించి, సర్టిఫికెట్లు అందించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, శివ ప్రసాద్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవాలు



సీమంతాలు చేస్తున్న సీడీపీఓ, తదితరులు

రఘునాథపాలెం: ఖమ్మం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రఘునాథపాలెం మండలంలో పోషణ మాసోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని మూడు సెక్టార్ల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ల సమన్వయంతో బూడిదంపాడు రైతు వేదికలో ఖమ్మం అర్బన్ సీడీపీఓ వీరభద్రమ్మ సమక్షాన చిన్నారులకు అక్షరాభ్యాసం, సామూహిక సీమంతాలు నిర్వహించగా.. సీడీపీవో పోషక విలువలు తీసుకోవడం వలన కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మంచుకొండ వైద్యాధికారి నిరోషా, సీహెచ్ఓ రమాదేవి, ఏఎన్ఎం రత్నకుమారి, సెక్టార్ సూపర్‌వైజర్లు వెంకటమ్మ, పర్వీన్, వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టు

ఖమ్మం వైరారోడ్: పెంచిన బస్సు చార్జీలకు నిరసనగా.. హైదరాబాద్‌లోని బస్సు భవన్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనకుండా గురువారం ఖమ్మం రెండవ పట్టణ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో ఖమ్మం నగర పార్టీ అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు సురేష్, సతీష్, జైదుర్గా ప్రసాద్, ఉపేందర్ ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం..!

నగరంలో నిత్యం రద్దీగా ఉండే తెలంగాణ తల్లి విగ్రహం సమీపాన రోడ్డు దెబ్బతింది. హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాలు ఈ రహదారిలోనే ప్రయాణిస్తుండడంతో రోడ్డుపై పెద్ద గుంత ఏర్పడి ట్రాఫిక్ సిగ్నల్‌తో పాటు ఫౌంటేన్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కేబుల్ వైర్లు బయటకు కనిపిస్తున్నాయి. రాత్రి సమయాన ద్విచక్ర వాహనదారులు వేగంగా వస్తే తీవ్ర ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉంది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్

